క్లుప్తంగా

రీ సర్వేకు రైతులు సహకరించాలి

బూర్జ: మండలంలోని వైపర్త గ్రామంలో భూముల రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని డొంకలపర్త సచివాలయ గ్రామ వీఆర్వో వంజరాపు రమేష్ నాయుడు కోరారు. గ్రామ రైతులతో రీ సర్వేపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల సర్వేయర్ గణపతిరావు పాల్గొన్నారు.

నేడు డీవార్మింగ్ డే



తాడివలస జెడ్పీహెచ్ఎస్‌లో మాత్రలను పరిశీలిస్తున్న డీఐఓ

పొందూరు: డీవార్మింగ్ డేను గురువారం నిర్వహించనున్న దృష్ట్యా ప్రతీ పాఠశాలకు ఆల్బెండజోల్ మాత్రలను అందాలని డీఐఓ (డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్) డాక్టర్ ఆర్‌వీఎస్ కుమార్ తెలిపారు. మండలంలోని తాడివలస ఆరోగ్యకేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ చేసి మాత్రలు సరఫరాను పరిశీలించారు. డాక్టర్ జి.రమేష్‌నాయుడు, ఇన్‌చార్జి హెచ్‌ఎం పూజారి హరిప్రసన్న, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దోమల నిల్వ ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

జలుమూరు: మనతోపాటు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీకాకుళం మెడికల్ సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. సైరిగాం గ్రామ పరిసరాలను పంచాయతీ సిబ్బందితో బుధవారం శుభ్రం చేయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లార్వా స్ప్రేయింగ్‌తోపాటు ఇంటింటా ఫీవర్ సర్వే నిరంతరం చేయాలన్నారు. జ్వరం ఉంటే వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించాలన్నారు. మెడికల్ అధికారి పి.గురునాథరావు, విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు, సిబ్బంది రంగమ్మ పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి రెండు నామినేషన్లు

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీలో ఈ నెల 19న జరగనున్న సర్పంచ్ ఉప ఎన్నికకు రెండు నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి ఎం.వి.రమణ తెలిపారు. బొమ్మాళి అశిరమ్మ, మజ్జి భారతి బుధవారం నామినేషన్లు వేశారన్నారు. అలాగే చిన్నకిట్టాలపాడు, లక్ష్మీపురం, కరడశింగి, రామకృష్ణారావు, గోవర్ధనపురం పంచాయతీలలో వార్డు సభ్యులకు ఎటువంటి నామినేషన్లు రాలేదన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన పూర్తిచేయాలి



శ్రీరామనగర్‌లో బీఎల్ఓకు సూచనలిస్తున్న తహసీల్దార్

నరసన్నపేట: ఓటర్లు జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమం త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ ఎ.సింహాచలం బీఎల్ఓలకు సూచించారు. ఇంటింటా పరిశీలన ప్రారంభించి 20 రోజులు అవుతుందని, మరో పది రోజుల్లో పూర్తి కావాల్సి ఉందన్నారు. బుధవారం ఆయన నరసన్నపేట పట్టణంలోని బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ఇంటింటా పరిశీలనను తనిఖీ చేశారు. నరసన్నపేట నియోజకవర్గంలో కేవలం 26 శాతం మాత్రమే స్వచ్ఛీకరణ అయిందన్నారు. జాప్యం చేస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

11న జాబ్ మేళా..

నరసన్నపేట: స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరెక్టర్ స్వరూప్ కోరారు. సిక్కోలు స్వచ్ఛంద సేవా సంస్థ, టీమ్ హెచ్‌ఆర్‌అండ్ కో సంయుక్తంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బుధవారం తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ, డిప్లమా పూర్తి చేసినవారు హాజరు కావచ్చన్నారు. అమెజాన్, అపోలో, మెడిప్లస్, ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు వచ్చి ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. నిరుద్యోగ యువకులు ఫోన్ 6302053783 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

నరుబుజ్జిలి: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పురుషోత్తపురం ఏపీజీవీబీ మేనేజర్ కె.మధు అన్నారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో మండలంలోని అలమాజీపేట గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైకేపీ ఏపీఎం కమల కుమారి పాండ్యన్, సీసీ కూన రోజాలత, మహిళాపోలీస్ బాలామణి, సీఎఫ్ఎల్ సిబ్బంది సీహెచ్ వెంకటేష్, రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి



బూర్జ: ఓవీపేటలో వృద్ధిరాలికి అభివాదం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ఓవీపేట, లచ్చయ్యపేటలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే సాంకేతిక కారణాలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి పట్టంకడితే ప్రజాసంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



పాతపట్నం: నీమణిదుర్గ కాలనీలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించే ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం సచివాలయం-3 పరిధిలోని నీలమణిదుర్గ కాలనీ 1, 2, 3 వీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇప్పటివరకు ఆయా కుటుంబ సభ్యులు పొందిన ఆర్థిక ప్రయోజనాలను గురించి బుక్‌లెట్‌లు అందజేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందజేయటం జరుగుతుందన్నారు. రాజకీయాలతో పనిలేకుండా సంక్షేమ పథకాలను అందించే ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు కోరారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓ కూర్మారావు, ఏఎంసీ చైర్మన్ అర్జునరావు, వైస్ ఎంపీపీ ప్రదీప్, దొర పార్వతీశం, చింతాడ త్రినాథరావు, తాగెల సుధాకర్, కర్రి లక్ష్మీనారాయణ, రాము, రాజు, వరదరాజులు, కృష్ణారావు, నాగేశ్వరరావు, డకర చిన్నారావు, తూలుగు ప్రవీణ్, వైస్ సర్పంచ్ మమత పాల్గొన్నారు.

చంద్రబాబు జిల్లాకు చేసింది శూన్యం

- వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో శ్రీకాకుళం జిల్లాకు చేసింది శూన్యమని, ఇప్పుడు జిల్లాలో ఏ ముఖం పెట్టుకుని పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. ఆమదాలవలసలో గల జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గల ప్రధానమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు మడ్డువలస, వంశధార, ఆఫ్‌షోర్‌లో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు చేసింది శూన్యమన్నారు. జిల్లా అభివృద్ధికి తోడ్పడే వేరే ఏదైనా ఒక్క ప్రజెక్టు అయినా చంద్రబాబు తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. వేల మందికి ఉపాధినిచ్చే ఆమదాలవలస కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీని మూయించారని గుర్తుచేశారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులు ఏవైనా ఉన్నాయంటే అవి ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చలవేనన్నారు. వంశధార ప్రాజెక్టు కోసం ఒకేరోజు రూ.900 కోట్లను వైఎస్సార్ కేటాయించారన్నారు. జిల్లా అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు సీఎం జగన్ చేస్తున్నారన్నారు. భావనపాడు పోర్ట్ పూర్తయితే జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. చంద్రబాబు హయాంలో చేసిన అభివృద్ధిపై జిల్లాకు చెందిన ఏ ఒక్క టీడీపీ నాయకుడైనా దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. పార్టీ నాయకులు ముద్దాడ ఈశ్వరరావు, కొప్పల ఈశ్వరరావు, పైడి రామారావు, గురుగుబెల్లి భాస్కరరావు, చింతాడ రాఘవేంద్ర పాల్గొన్నారు.

నిర్వాసితులను మోసం చేసింది చంద్రబాబే



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ తులసీవరప్రసాద రావు

కొత్తూరు: భావితరాల కోసం సర్వం త్యాగం చేసిన వంశధార నిర్వాసితులను మాజీ సీఎం చంద్రబాబు మోసం చేశారని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, హిరమండలం మండలం ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న వంశధార ప్రాజెక్టును పరిశీలించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తికాకుండా 23 ముంపు గ్రామాల్లో ఉన్న నిర్వాసిత కుటుంబాలను గ్రామాల నుంచి నిర్దాక్షిణ్యంగా పోలీసుల చేత నెట్టేసిన చంద్రబాబు.. నేడు ఆ నిర్వాసితుల కోసం పోరాడుతున్నాని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వంశధార ప్రాజెక్టు పనులతో పాటు నిర్వాసితులు ప్యాకేజీల్లో తీవ్ర స్థాయిలో అక్రమాలు జరడంతో నిజమైన నిర్వాసితులకు నష్టం జరిగిన చంద్రబాబు నాయుడు పట్టించుకోలేదన్నారు. ఎంపీటీసీ పాడ్డిన సింహాచలం, తొత్తడి అరుణ, తవిటయ్య, తట్ట శంకరరావు, గులుమూరు సర్పంచ్ సుంకర కోటేశ్వరరావు, తొత్తడి పాలినాయుడు, మెట్టూరు-3 సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, సంజీవరావు, గొర్లె మోహన్‌రావు, యర్లంకి మన్మథరావు, గవర ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'ఐలు' రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస: గుంటూరులో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 12వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమదాలవలస బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.విజయ్‌కుమార్, న్యాయవాదులు బగాది గోవిందరావుజులు, ఎస్.ప్రసాదరావు, జి.ప్రభాకరరావు, ఎ.రమణరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, రేషన్ డిపోల్లో తనిఖీలు

పొందూరు: మండలంలోని రాపాక, పొందూరు గ్రామాల్లోని రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల, వసతి గృహాలను ఏపీ ఫుడ్ కమిటీ సభ్యుడు బి.కాంతారావు, ఇతర సభ్యులు బుధవారం తనిఖీ చేశారు. రాపాక డిపోలో 5 బియ్యం బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించి పూర్తిస్థాయి విచారణ జరిపి కేసులు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అదే గ్రామంలో 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వంట ఆలస్యంగా చేయడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ కమిటీ సభ్యులు హాజరవుతున్నారని సమాచారం ఇచ్చినా ఐసీడీఎస్ అధికారులు గైర్హాజరవ్వడంతో ఫుడ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అదే గ్రామంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పొందూరులో బీసీ వసతి గృహాన్ని సందర్శించి సాయంత్రం భోజనాన్ని పరిశీలించారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

ఆహార భద్రతా నియమాలు తప్పనిసరి

నరసన్నపేట: వ్యాపారులు, హోటళ్ల యజమానులు విధిగా ఆహార భద్రతా నియమాలు పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం అన్నారు. నరసన్నపేటలో పలు హోటళ్లు, కిరాణా హోల్‌సేల్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటళ్లలో ఆహార పదార్థాల్లో రంగులు అధిక మొత్తంలో కలుపుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మోతాదుకు మించి రంగులు కలుపుతున్నట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



పాతపట్నం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సారవకోట: నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

- గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: గిరిజనులు అన్ని రంగల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆదివాసీ భవనంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమానికి హాజరయ్యారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గిరిజనులకు భూ హక్కు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్‌చేసి గిరిజనులకు పంచారు. ఆదివాసీ భవనం ఆవరణలో ఉన్న అంబేడ్కర్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, బీర్సా ముండా విగ్రహాలకు నివాళులర్పించారు. ఎంపీపీ దొర సావిత్రి, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, ట్రైకార్ డైరెక్టర్ ఈశ్వరమ్మ, భాగ్యలక్ష్మి, ప్రసాదరావు, వాబ యేగి, అప్పన్న, నారాయణమూర్తి, సూర్యం, అర్జునుడు, ప్రదీప్, తాతయ్య, మోహన్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

సారవకోట: మండల కేంద్రంలోని గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. గిరిజన నాయకులు జన్ని రామారావు, గుజ్జువాడ సోమేశ్వరరావు, హేమలత, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని బైదలాపురం గిరిజన ఆశ్రమ బాలుర ఉతన్నత పాఠశాలలో ప్రపంచ ఆదివాసుల దీనోత్సవం సందర్భంగా 200 మంది గిరిజన విద్యార్థులకు అట్టలు, పెన్సిళ్లు, పెన్నులు రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థులు నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. గిరిజన విద్యార్థులతో కలిసి శ్రీకాంత్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, గణేష్ ప్రధాన్, సర్పంచ్ ఆనంద్, కిరణ్, సుక్కు, హెచ్‌ఎం గొరేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మామిడి శ్రీకాంత్

మెళియాపుట్టి: మండలంలోని మామిడి గుడ్డి గిరిజన గ్రామంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి గిరిజనులకు పంచి పెట్టారు. విద్యార్థులకు పెన్నులు, అట్టలు, పెన్సిళ్లు పంచారు. ఉర్లాన రుషి తదితరులు ఉన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

గిరిజన సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. సీతంపేట ఐటీడీఏ వద్ద బుధవారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్నారు. - ఎల్.ఎన్.పేట



24 గంటలూ వైద్యసేవలు అందించాల్సిందే



మెళియాపుట్టి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మెళియాపుట్టి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, 24 గంటలూ వైద్య సేలందించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. బుధవారం మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.60లక్షలతో నవీకరించిన రిషెప్షన్, ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాలలో ఫోన్ చేస్తే అరగంటలో ఆసుపత్రికి చేరుకునేలా ఉండాన్నారు. అసలు అందుబాటులో వైద్యులు లేరన్న మాట వినిపించకూడదన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మీనాక్షి, ఎంపీడీఓ చంద్రకుమారి, తహశీల్దార్ సరోజిని, వైద్యులు అలేఖ్య, గ్రీష్మ, పావని, హేమంతలక్ష్మీ, రెడ్డీస్ ప్రతినిధులు, శ్రీనివాస్, సత్తి, ప్రణవ్‌కుమార్, దీపక్, సురేష్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కృష్ణారావు మృతికి సంతాపం



కృష్ణారావు అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పారశెల్లి తేజేశ్వరరావు తండ్రి కృష్ణారావు మంగళవారం రాత్రి మృతి చెందారు. స్వగ్రామంలో బుధవారం జరిగిన అంత్యక్రియల్లో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. కృష్ణారావు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, నాయకులు నక్క తులసీదాస్, శంకరరావు, యాళ్ల శ్యామసుందరరావు, గెల్లంకి వెంకటరావు, రావాడ భాస్కరరావు, నిక్కు రాజశేఖర్ తదితరులున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాసరావు(ఫైల్)

బూర్జ: మండలంలోని కంట్లాం గ్రామానికి చెందిన బైరి శ్రీనివాసరావు (40) మంగళవారం రాత్రి పురుగు మందు తాగి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఖాళీ బాటిల్ చేతిలో పట్టుకోని ఇంటిపైన పడుకున్నాడు. ఎప్పటికి కిందకు దిగకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. 108లో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. శ్రీనివాసరావుకు భార్య బైరి లక్ష్మి, కుమారుడు ఉన్నాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అప్పులే మృతికి కారణమని అనుమానిస్తున్నారు.

దేశభక్తిని పెంపొందిద్దాం



బూర్జ: మొక్కలు నాటుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని ఓవీపేటలో స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం నిర్వహించారు. నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నరసన్నపేట: నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవాది, రావులవలస, గోపాలపెంట, కామేశ్వరిపేటల్లో బుధవారం పలు కార్యక్రమాలను ఎంపీడీఓ మధుసూదనరావు నిర్వహించారు. దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఏపీడీ మురళీకృష్ణ, ఏపీఓ యుగంధర్, సచివాలయ సిబ్బంది, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మాతృభూమిని ప్రతీ భారతీయ పౌరుడు గౌరవించాలని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా గోనెపాడులో ఉపాధి యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దేశ పరిరక్షణకోసం ప్రాణాలు త్యాగం చేసిన వీరులకు వందన సమర్పణ చేశారు. పుడమితల్లిని కాపాడాలని కోరారు. సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, ఉపాధి ఏపీఓ బొత్స పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని గూనభద్ర అపోజిట్ ఆర్ ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆజాదీకా అమృత్ మహోత్సవం వేడుకలను సర్పంచ్ పెదకోట సాధుబాబు ప్రారంభించారు. నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం నినాదంతో పలు కార్యక్రమాలను నిర్వహించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.గంగునాయుడు అన్నారు. మండలంలో జొన్నవలస గ్రామ పంచాయతీలో పెద్ద చెరువు వద్ద కళాశాల ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధవారం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కల అవశ్యకతపై ప్రతిజ్ఞ చేసి, గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాడి, పంటలు అభివృద్ధి చెందాలంటే చెట్లను సంరక్షించుకోవాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు. చెట్లు అంతరించిపోవడం వల్ల వర్షాలు తగ్గి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం చూపుతుందన్నారు. సర్పంచ్ గొంటి అనిల్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

నరసన్నపేట: పంటల సాగులో సాధిస్తున్న దిగుబడిని శాస్త్రీయంగా అంచనా వేయడానికి, పంట కోత ప్రయోగాల సర్వేకు గణాంక శాఖ శ్రీకారం చుట్టిందని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ సుజాత అన్నారు. పంటకోత ప్రయోగానికి పొలం ఎంపిక ప్రధానమన్నారు. దీనిపై వీఆర్వోలు, వీఏఏలు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంట కోత ప్రయోగాలపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే నంబర్ల ప్రకారం పొలం, రైతు ఎంపిక కీలకమన్నారు. దీనిపై దృష్టి సారించాలన్నారు. పంట కోత ప్రయోగాల వల్లే ఉత్పత్తి, ఉత్పాదకత నిర్ధారణ అవుతుందన్నారు. గ్రామం యూనిట్‌గా పంట కోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పంటల నమోదుపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుపై దృష్టి పెట్టాలని సూచించారు. పంటల నమోదు ఎలా చేయాలో వివరించారు. తహసీల్దార్ ఎ.సింహాచలం, ఏఓ కె.సునీత, హార్టికల్చరల్ ఆఫీసర్ సుదర్శన, ఏఎస్ఓ శేఖర్‌బాబు తదితరులు పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

సంక్షిప్తంగా...

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

పాతపట్నం: పాతపట్నం మార్కెట్ యార్డులో అలిమ్-కో సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంక్షేమ శాఖ ఏడీ కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో ఉన్న దివ్యాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రసవాలకు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తే చర్యలు

పొందూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను చేయకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించే వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ జె.భాస్కరరావు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ప్రసవాల పెంపుపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిపుణులైన గైనకాలజిస్టు, ఎనస్తీషియా ఉన్నారన్నారు. కింతలి పీహెచ్‌సీలో 35 ప్రసవాలు జరుగగా.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 177 ప్రసవాలు, తాడివలస పీహెచ్‌సీ పరిధిలో 24 ప్రసవాలు జరుగగా.. ప్రైవైటే ఆస్పత్రుల్లో 108 ప్రసవాలు, జి.సిగడాం పీహెచ్‌సీ పరిధిలో 23 ప్రసవాలు మాత్రమే జరగడంతో వైద్యులను వివరాలు కోరారు. పొందూరు సామాజిక ఆస్పత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

గ్రంథాలయాధికారికి పురస్కారం

హిరమండలం: హిరమండలం శాఖా గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మకు ప్రతిభ పురస్కారం లభించింది. జిల్లా గ్రంథాలయలంలో వేసవి శిక్షణ శిబిరాల్లో చేసిన పనితీరుకు ఉత్తమ గ్రంథాలయాధికారిగా జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ఎస్.సువర్ణ చేతులమీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు. పాతపట్నం శాఖాగ్రంథాలయాధికారి కాళ్ల రాజు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలిపారు.

64 మందికి కంటి పరీక్షలు

కొత్తూరు: మండల కేంద్రంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మాల్లా విశ్వనాథం జ్ఞాపకార్థం ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని ప్రవచనకర్త యాలాల శ్రీనివాసరావు భక్త బృందం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. 64 మందికి స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకి రామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. 24 మందికి అంతర కుసుములు ఉన్నట్లు నిర్ధారించారు. వీరికి శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయిస్తామన్నారు.